క్లుప్తంగా

ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందించాలి



క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సతీష్‌బాబు

రౌతులపూడి: విద్యాప్రమాణాలను పాటిస్తూ ప్రతి విద్యార్థికి మెరుగైన, సృజనాత్మకమైన విద్యను అందివ్వాలని ఎంఈఓ కె.సతీష్‌బాబు హెచ్ఎంలను ఆదేశించారు. శనివారం మండలంలోని రౌతులపూడి, ములగపూడి, ఎస్.అగ్రహారం జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులతో క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. సంబంధిత పాఠశాలలో ఉపాధ్యాయుల పని తీరు, ప్రస్తుతం పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల నడవడిక, పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా క్లస్టర్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయండి

శంఖవరం: ఈ-పంట నమోదు వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి ఫి.గాంధీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రైతు సేవా కార్యక్రమంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 25 లోపు ప్రతి గ్రామంలో ఉన్న అన్ని రకాల భూముల ఖాతాలు నమోదు చేయాలన్నారు. పంట నమోదు చేయడం ద్వారా నష్టపోయిన రైతులకు సబ్సిడీ అందుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై టీ.రామకృష్ణ హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను శనివారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే సందర్భాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మన అజాగ్రత్త వల్లే కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు

గండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఏఓ జె.లక్ష్మి తెలిపారు. పంటను కనీస మద్దతు ధరకు విక్రయించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, రైతులు ధాన్యం అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు, తదితర అంశాలపై ఈ కార్యక్రమం జరిగినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్, సివిల్ సప్లై ఏజీఎం కె.భాను ప్రియ, ఉద్యానశాఖ, కస్టోడియన్, మిల్లర్లు, సొసైటీ, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది బుగతా శివ

ఏలేశ్వరం: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది బుగతా శివ పేర్కొన్నారు. మండలంలోని యర్రవరం గ్రామంలో శనివారం మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో జాగృతి కార్యక్రమం నిర్వహించారు. చట్టాలపై అవగాహన ఉంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. న్యాయ అవగాహన సదస్సులో భాగంగా అధార్ కార్డు లేని వారు మండల లీగల్ కమిటీని సంప్రదించి కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, కార్యదర్శి రామరాజు, న్యాయవాదులు అవసరాల దేవి, అకాశపు మల్లేశ్వరరావు, కలవలపల్లి సుజన గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభను విజయవంతం చేయండి

తుని: అన్నవరంలో ఈ నెల 29న జరిగే ఏబీసీ వర్గీకరణ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం ఆ మేరకు స్థానిక గొల్లప్రోలు సెంటర్లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందపల్లి సత్యన్నారాయణ, జిల్లా ఇన్‌చార్జి పలివెల శివమణి కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య, హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథులుగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి వేలాదిగా మాదిగలు, ఉపకులాలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

చెరకు.. కనుమరుగు

- మూతపడిన తాండవ సుగర్ ఫ్యాక్టరీ
- సాగును ప్రోత్సహించాలని రైతుల విజ్ఞప్తి
- ప్రత్యామ్నాయ పంటల వైపు సాగుదారులు



కాకరాపల్లిలో సాగు చేసిన చెరకు (ఫైల్)

కోటనందూరు: ఒకప్పుడు జిల్లాలో వరి తరువాత అత్యధిక విస్తీర్ణంలో చెరకు పంట సాగయ్యేది. చెరకుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడం, సుగర్ ఫ్యాక్టరీలు చెరకు డబ్బులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం, సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం వంటి కారణాలతో రైతులు చెరకు సాగును వదిలేసి ఇతర పంటవైపు మళ్లుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఆదాయ వనరుగా ఉండే చెరకుసాగు ప్రస్తుతం కనుమరుగైంది. తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఒకప్పుడు ఎక్కడ చూసినా చెరకే దర్శనమిచ్చేది. సీజన్ వచ్చిందంటే చెరకు బళ్లతో మెట్ట ప్రాంతమంతా కళకళలాడేది. అలాంటి చెరకు సాగు ఇప్పుడు మచ్చుకు కూడా కనబడడం లేదు. కనీసం దేవుడికి నైవేద్యంగా చెరకుముక్క పెట్టాలన్నా దొరికే పరిస్థితి లేదు. ఈ దుస్థితికి కారణం తాండవ సుగర్ ఫ్యాక్టరీ మూతపడటమే. ఈ ఫ్యాక్టరీలో రాజకీయ జోక్యం పెరిగిపోయి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గత దశాబ్ద కాలంగా మూతపడింది. దీంతో మెట్ట ప్రాంతంలో చెరకు సాగు క్రమంగా కనుమరుగైంది. ఫలితంగా రైతులకు ఖరీఫ్‌లో వరి పంట తరువాత మరో పంట పండించుకునే అవకాశం లేకుండా పోయింది. పాలకులు స్పందించి ఎందరికో అండగా ఉండే తాండవ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, ఎంతో లాభదాయకంగా ఉండే చెరకు సాగును ప్రోత్సహించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఐదు దశాబ్దాల క్రితం తుని, పాయకరావుపేట సరిహద్దు ప్రాంతంలో తాండవ సుగర్ ఫ్యాక్టరీని నిర్మించారు. ఈ ఫ్యాక్టరీ తుని, ప్రత్తిపాడు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఈ కర్మాగారంలో 13 వేల మంది షేర్ హోల్డర్లు ఉండగా 650 మంది కార్మికులు పని చేసేవారు. సుమారుగా 25 వేల నుంచి 30 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. ఫ్యాక్టరీ నెలకొల్పిన తొలినాళ్లలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరకూ క్రషింగ్ జరిగేది. కాల క్రమంలో క్రషింగు సామర్థ్యం వేల టన్నులకు దిగజారింది. అనంతరం పరిస్థితి మరింత క్షీణిస్తూ చివరకు క్రషింగు చేయలేని దయనీయ పరిస్థితికి చేరి మూతపడింది.

సాగు లాభదాయకం

మెట్ట ప్రాంతంలో చెరకుసాగు లాభదాయకంగా ఉంటుంది. చెరకుసాగుకు పెట్టుబడి తక్కువ. ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుని నిలబడుతుంది. పెద్దగా కూలీల సమస్య కూడా ఉండదు. రైతుకు పంట నష్టాలు చవిచూస్తాం అనే భయం రైతుకు ఉండదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పెట్టుబడికి రెండింతల ఆదాయం వస్తుంది. కాగా వరిసాగు చెరకుకు భిన్నం. ఎకరాకు రూ. 30 వేల వరకూ పెట్టుబడి. కలుపు, కూలీలు, ప్రకృతి విపత్తులు అన్నీ సమస్యలే. దిగుబడి ఇంటికి చేరే వరకూ దినదినగండమే. చివరకు దిగుబడి ఇంటికి చేరినా..పెట్టుబడి డబ్బులే వస్తున్నాయి.

పంట భూమిని కాపాడుకునే అవకాశం

మెట్టలో చెరకుసాగు లేకపోవడంతో కేవలం వరి మాత్రమే సాగు చేస్తున్నారు. చెరకుకు పెద్దగా తెగుళ్ల బెడద ఉండదు. కాబట్టి పురుగు మందులు పిచికారి చేయాల్సిన అవసరమూ ఉండదు. వరికి తెగుళ్ల బెడద ఎక్కువ. వాటి నివారణకు తరచూ క్రిమిసంహారిక మందులు వినియోగించాల్సిన పరిస్థితి. మందుల ప్రభావానికి ఏటా నిస్సారమైపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇది భవిష్యత్ తరానికి ప్రమాదభరితంగా మారే అవకాశం ఉంది.



పాతకొట్టాంలో నిరుపయోగంగా ఉన్న చెరకు కాటా

అన్యాక్రాంతమైపోతున్న కాటాలు

తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న చెరకు సేకరణ కేంద్రాలు (కాటాలు) అన్యాక్రాంతమైపోతున్నాయి. ఫ్యాక్టరీ పరిధిలో మొత్తం 12 కాటాలుండగా కోటనందూరు మండలంలోనే ఆరు కాటాలున్నాయి. ఈ కాటాలు మందుబాబులకు అడ్డాగా మారడంతో పాటు అన్యాక్రాంతమైపోతున్న పరిస్థితి కనిపిస్తోంది.

సాగును ప్రోత్సహించాలి



వరిసాగుతో రైతుకు పెద్దగా కలిసొచ్చేది ఉండదు. సాగు ఆద్యంతం అన్నీ సమస్యలే. చివరికి పైసా ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. చెరకుకు పెట్టుబడి తక్కువ. పెద్ద ఇబ్బంది ఉండదు. మంచి ఆదాయం వస్తుంది. గతంలో మాదిరిగా రాయితీలు ఇచ్చి ప్రభుత్వం చెరకు సాగును ప్రోత్సహించాలి. మెట్ట ప్రాంత రైతుకు ప్రభుత్వం అండగా నిలబడాలి.

కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

ఫ్యాక్టరీని తెరవాలి



సుమారు పదేళ్లగా మూతపడిన తాండవ సుగర్ ఫ్యాక్టరీని తెరవాలి. వేల సంఖ్యలో రైతులు, వందలాది కార్మికులకు ఆసరాగా ఉండే ఫ్యాక్టరీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పాలకులు, అధికారులు కృషి చేయాలి. పరిశ్రమ ప్రారంభమైతే మెట్ట ప్రాంత రైతాంగానికి ఆర్థికంగా భరోసా లభిస్తుంది.

యల్లపు రామసూర్య సత్యనారాయణ, రైతు, బొద్దవరం

'సాక్షి'పై వేధింపులు సరికాదు



కోటనందూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టు, ప్రజాసంఘాల నాయకులు



ఏలేశ్వరంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వినోద్‌మిశ్రా పార్టీ శ్రేణులు



తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కోటనందూరు: ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తున్న 'సాక్షి' మీడియాపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం అన్యాయమని జర్నలిస్టు, ప్రజా సంఘాలు మండిపడ్డాయి. కోటనందూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపాయి. ప్రజా సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు ప్రభుత్వం, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా గళం విప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే మాట్లాడుతూ వాస్తవాలను నిర్భయంగా రాస్తున్న 'సాక్షి' మీడియాపై ప్రభుత్వం కక్ష కట్టడం సరైన విధానం కాదన్నారు. అక్రమ మద్యం వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చిందనే అక్కసుతో 'సాక్షి' ఎడిటర్‌పై పోలీసులు దాడులకు దిగడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. పత్రికలకు స్వేచ్ఛ లేకపోతే ప్రజాసమస్యలకు పరిష్కారం దొరకదని ఆందోళన వ్యక్తం చేశారు. 'సాక్షి' మీడియాపై దాడులు ఆపి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి కుమార్, గెడ్డం అజయ్ బాబు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

ఏలేశ్వరం: 'సాక్షి' మీడియాపై దాడిని ఖండిస్తూ పట్టణంలో శనివారం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో వినోద్‌మిశ్రా నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కలంపై జులుం ప్రదర్శించడం దారుణమన్నారు. 'సాక్షి' దినపత్రికపై కక్ష్య సాధింపులకు దిగడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఆర్టికల్ 19 (1) ప్రకారం రాజ్యాంగం ప్రసాదించిన పత్రిక స్వేచ్ఛను హరించే హక్కు ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే 'సాక్షి' దినపత్రికపై కక్షసాధింపు చర్యలను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండేటి పెదనాగమణి, కందుల వరలక్ష్మీ, పలపా సుందరి, గూనాపు వరలక్ష్మీ, కందులప్రసాద్, కొంతం రాజు, గూనాపు సాయి, పందిరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు సంకెళ్లు వేయడం సరికాదు

ప్రత్తిపాడు: 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ ప్రత్తిపాడులో పాత్రికేయులు శనివారం ఆందోళన చేపట్టారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, నెల్లూరు రిపోర్టర్ల పైనా తరచూ విచారణలు, ఆధారాలు ఇవ్వాలంటూ వేధించడాన్ని పాత్రికేయులు దుయ్యబట్టారు. ప్రత్తిపాడు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసి అణిచివేయాలని చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పత్రికలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

కళాశాలల ప్రైవేటీకరణ దారుణం



బెండపూడిలో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మండలంలోని బెండపూడిలో శనివారం పార్టీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు మద్దుకూరి సత్యనారాయణ చౌదరి (పెద్దబ్బు), జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి తదితరులు కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోకుంటే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. అనంతరం పార్టీ నాయకులు, సామాన్య ప్రజలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేసి మద్దతూ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు గొంతెన నాగేశ్వరరావు, బూసాల గణపతి, సోమిశెట్టి చలపతి, మళ్ల తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు పంచాయతీ వాహనాలా?



నీలాద్రిరావుపేట శుభమస్తు ఫంక్షన్ హాల్ వద్ద చెత్త సేకరిస్తున్న పంచాయతీ ట్రాక్టర్

గండేపల్లి: పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ఉపయోగించే పంచాయతీ యంత్రాలు ప్రైవేట్ వ్యాపారస్తులకు సేవలందించే పనిలో నిమగ్నమవుతున్నాయి. యంత్రాలతో పాటు పంచాయతీ కార్మికులను సైతం ఇష్టారీతిన వారి సేవలను వాడుతున్నారు. సాధారణంగా వీధుల్లోని డ్రైనేజీల వ్యర్థాలు, పూడిక మట్టి తరలించేందుకు పంచాయతీకి చెందిన (యంత్రాలు) ట్రాక్టర్లను ఉపయోగించడం పరిపాటి. కాని మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీలకు చెందిన యంత్రాలను ప్రైవేటు ఫంక్షన్‌లకు ఉపయోస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధి గోకవరం రోడ్డులోని నీలాద్రిరావుపేట శుభమస్తు ఫంక్షన్ హాల్, జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్, మల్లేపల్లి, తదితర గ్రామాల్లోని (ఫంక్షన్ హాల్స్)లో కార్యక్రమాలు ముగిసిన అనంతరం పేరుకుపోయిన వ్యర్థాలను తరలించేందుకు పంచాయతీ ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారని, వాహనాలకు ఆయిల్, తదితర ఖర్చులు ఏ విధంగా నమోదు అవుతున్నాయో ప్రజల మదిలో ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల సూచనలు, ఆదేశాల మేరకు సెలవు దినాలలో సైతం పనులు చేయాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం



అంబులెన్స్ సిబ్బంది సమక్షంలో క్షేమంగా తల్లి, బిడ్డ

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీ జల్దాం పంచాయతీ పరిధిలోని డి.పైడిపాలకు చెందిన కె.దుర్గా చినతల్లి 108లో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమె పురిటినొప్పులతో శనివారం బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు రౌతులపూడి సీహెచ్‌సీకి సమాచారం అందించారు. మారుమూల ప్రాంతం కావడంతో అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యమైంది. దీనితో నొప్పులు ఎక్కువ కావడంతో మార్గ మధ్యలో అంబులెన్స్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేయడంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చిందని సిబ్బంది తెలిపారు. తల్లిబిడ్డలను స్థానిక సీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగానే ఉన్నారని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా సులభ ప్రసవం నిర్వహించిన 108 సిబ్బందిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఈఎంటీ శ్రీలక్ష్మి, పైలట్ రమేష్, ఓఈ సతీష్, డీఎం అవినాష్, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి మాజీ సర్పంచ్ దేవళ్లు మృతి



వాసిరెడ్డి వెంకటేశ్వర్లు (దేవుళ్లు) ఫైల్



పాడె మోస్తున్న ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: మండల కేంద్రం రౌతులపూడి గ్రామా మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వాసిరెడ్డి వెంకటేశ్వర్లు (దేవుళ్లు) 86 గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. 1988లో తొలిసారిగా సర్పంచ్ పదవిని అలంకరించి గ్రామానికి ఎనలేని సేవలందించారు. అనంతరం మూడు పర్యాయాలు ఆయన అనుచరులను సర్పంచ్‌గా గెలిపించుకుని తిరుగులేని రాజకీయ దురంధరుడుగా పేరుగాంచారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు అత్యంత సన్నిహితుడుగా ఉండేవారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు బాబ్జి, జమీలు ప్రస్తుతం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా పదవి చేపట్టి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

పాడె మోసిన ముద్రగడ

మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వెంకటేశ్వర్లు(దేవుళ్లు) పార్థివ దేహాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ముఖ్య అనుచరుడుగా అత్యంత సన్నిహితుడుగా పేరొందిన దేవుళ్లు మన మధ్య లేకపోవటం బాధాకరమని గిరిబాబు విచారం వ్యక్తం చేశారు. కుమారులు బాబ్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలకు, భాస్కర బాబుకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం దేవుళ్లు పార్థివ దేహం పాడెను మోసి తమ కుటంబంతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఆయన మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటు అని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు ముదునూరి పరామర్శ



అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పలువురు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సింగిలిదేవి అప్పారావు ఇటీవల మరణించగా ఆయన కుమారుడు రాంబాబును పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు ముమ్మిడి అప్పన్న తల్లి ఇటీవల కాలంలో మృతి చెందారు. కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, నాయకులు తదితరులున్నారు.

న్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



న్యాయవాది పిట్టా సుగుణరావు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచి, న్యాయవాది పిట్టా సుగణరావును వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్టానం ఇటీవల నియమించింది. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అదిష్టానం అప్పగించిన భాధ్యతలను చిత్త శుద్ధితో నిర్వహిస్తానని, తనను జిల్లా లీగల్ సెల్‌కు ఎంపిక చేసిన పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నేతలకు సంబంధించి ఎటువంటి న్యాయ సమస్యలు వచ్చిన వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు, పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలి



సభలో ప్రసంగిస్తున్న చెక్కల రాజ్‌కుమార్

ప్రత్తిపాడు: కార్మిక రంగానికి కీడు చేసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో శనివారం జరిగిన సీఐటీయూ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ కార్మికులు సంఘటితమై సాధించుకున్న 49 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మారుస్తూ పార్లమెంట్‌లో ఆమోదించిన నిర్ణయాన్ని కార్మికులంతా అడ్డుకోవాలన్నారు. కార్మికులు పోరాటాల ద్వారానే తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం

గండేపల్లి: సమస్యల పరిష్కారానికై కార్మికులంతా ఐక్యంగా పోరాడుదామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇ.చంద్రవతి పేర్కొన్నారు. గండేపల్లిలో సీఐటీయూ కార్యాలయం వద్ద శనివారం మండల మహాసభ నిర్వహించారు. మూడేళ్ల కాలంలో పోరాట అనుభవాలను ప్రస్తావించారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా నొక్కు లలిత, కో కన్వీనర్‌గా వై.శ్రీనివాసరెడ్డి, సభ్యులుగా కె.శాంతి, సీహెచ్ దేవి, విష్ణు, లక్ష్మి, జ్యోతి, జి శ్రీహరి, ఎస్.సత్యనారాయణ, లక్ష్మణ్, రాజేశ్వరి, అమ్మాణి, కృష్ణవేణి, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, తదితరులను నూతన కమిటీగా ఎన్నుకున్నారు.

26 నుంచి సత్యదీక్షలు ప్రారంభం

ప్రత్తిపాడు: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంట సత్యనారాయణ స్వామి వారి సత్యదీక్షలు కార్తీక మాసంలో స్వామివారి మఖ నక్షత్రం రోజైన ఈ నెల 26 నుంచి నవంబర్ 13 వరకు 18 రోజుల పాటు కొనసాగుతాయని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు పేర్కొన్నారు. ప్రత్తిపాడులో శనివారం ఆయన సత్యదీక్షలపై ప్రచారం నిర్వహించారు. నవంబర్ 5వ తేదీ కార్తీక పౌర్ణమి ఉదయం 8 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నాలని కోరారు.

చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్ విడుదల

రౌతులపూడి: మండలంలోని అన్ని పాఠశాలలో ప్రారంభమయ్యే చెకుముకి సైన్సు సంబరాల (విద్యార్థుల ప్రతిభా పరీక్షాపోటీలు) పోస్టర్‌ను ఎంఈఓ-1,ఎంఈఓ-2లు కె.సతీష్‌బాబు, గాడి కొండబాబులు విడుదల చేశారు. శనివారం పాఠశాల స్థాయిలో ప్రారంభమైన ఈ పోటీలు వచ్చే నెల ఒకటిన మండల స్థాయిలోను, నవంబర్ 23న జిల్లాస్థాయి లోను, డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలోనూ సంబరాలు నిర్వహిస్తామని ఎంఈఓ తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

తుని: స్థానిక రోటరీక్లబ్ నిర్వహించే రోటరీ యవజనోత్సవాలు (రంగం) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శనివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తుని, పాయకరావుపేటకు చెందిన 250 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ నాగిరెడ్డి, కార్యదర్శి ప్రసన్న, దండెం మధుసూదన్, రామచంద్రరావు, నాగభూషణం, గౌరీశంకర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పోరుబాట

అన్నవరం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్‌జీఎస్) ఫీల్డ్ అసిస్టెంట్లు పోరుబాట పట్టారు. గత 20 సంవత్సరాలుగా అతి తక్కువ జీతాలకు పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు జీతాలను రూ.20 వేలుకు పెంచి, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులగా రెగ్యులర్ చేయాలని, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన శనివారం అన్నవరంలో జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్ల సాధనకు ఈ నెల 22న ఛలో విజయవాడకు పిలుపునిచ్చారు. వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ ప్రతినిధులు బల్ల ప్రసాద్, రాజారావు, సూర్యనారాయణ, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

గోకవరం: చోరీలకు పాల్పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం గోకవరం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన మేకల అనిల్‌కుమార్, గారడి నితిన్‌లను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు ఎస్సై పవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే నెహ్రూ జన్మదిన వేడుకలు

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో శనివారం నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలను కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు), కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ప్రత్తిపాడు, తుని, కాకినాడ, రూరల్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితర నాయకులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వసతి గృహంలో తనిఖీలు



వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణ

గోకవరం: మండలంలోని పలు వసతి గృహాలను నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎమ్‌వివి సత్యన్నారాయణ శనివారం తనిఖీ చేశారు. వసతి గృహాల్లో పారిశుధ్యం, ఆహారం నాణ్యతపై తీసుకుంటున్న చర్యలను మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల వసతిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో సౌకర్యాల మెరుగు కోసం నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ గోవిందు, వార్డెన్ రామకృష్ణ ఇతర సిబ్బంది ఉన్నారు.